# ఎదురు చూసిన ముహూర్తం

పి. సరళాదేవి

అప్పుడప్పుడే జ్ఞానం వస్తోన్న దుర్గకు ఆశలు పుడుతున్నాయి. పద్మ వేసుకున్నటువంటి పువ్వుల గౌను వేసుకోవాలనీ, ఎర్రటి శాటిన్ రిబ్బన్లు జడలకు కట్టుకోవాలనీ, మంచి మంచి బొమ్మలు కొనుక్కుని తోటి పిల్లల్ని వూరించాలనీ, పలకా పుస్తకాలూ కొత్త సంచీలో పెట్టుకుని బడికి వెళ్ళాలనీ కోరికలు కలుగుతున్నాయి.

రేపటితో తనకు అయిదు సంవత్సరాలు నిండి ఆరో ఏడు వస్తుందనీ, అక్క చెప్పిన మాటలు విని వంటింట్లో అమ్మ చెంగు పట్టుకొని మారాం చేస్తోంది పుట్టిన రోజుకి పువ్వుల గౌను కొనమని.

"అలాగే లేవే నాన్న వొచ్చాక చెబుదువుగాని, ఇక్కడ్నించి దయ చేయి." అని అమ్మ విసుక్కుంది.

వంటింట్లోంచి గబగబా వీధరుగు మీదికి వచ్చి ఈ చివర నుండి ఆ చివర వరకూ వీధిని పరకాయించి చూసి గబగబా మళ్ళా అమ్మ దగ్గరకు వెళ్ళి -

"నాన్న ఎప్పుడొస్తారే ?" అంది.

"దేనికి రాకపోయినా తిండికి హాజరవుతారు లేవమ్మా"

"మరి ..... మరి ఇంకా ఎన్నిగంటలుందమ్మా?" అంది దుర్గ అమ్మ విసుక్కి భయపడుతూ.

"ఏమిటే నీ గొడవ మరీనూ .... ఇక్కడ్నుంచి పోతావా చురకెట్టమంటావా ? .... ఒసే కాంతం, దీన్ని లాక్కెళ్ళవే" అన్న అమ్మ కేకలకు ఒక్కంగలో వీధిలోకి పరుగెత్తి అరుగుమీద కూర్చుంది. ఆ పసి మనసులో గౌను మీద వూహలు అల్లుకుంటున్నాయి.

పద్మ గౌనుకన్నా మంచి పువ్వుల గౌను కొనుక్కోవాలి. తన కలాంటి గౌను లేదని నిన్నంతా ఎంత వుడికించింది. నీకొకటే గాని నాకు రెండున్నాయని తను చెప్పేసింది. మరి వూరుకుంటుందేమిటి? పొద్దున్నే లేచి నాన్నతో బజారుకెళ్ళి గౌను తెచ్చుకుంటుంది. అది ఎంత బావుంటుందో.

అలా వూహిస్తూ కలవరిస్తూ ఆ అరుగు మీదే వొరిగి నిద్రపోయింది దుర్గ. అమ్మ వొచ్చి లేపడానికి ఎంత ప్రయత్నించినా లేవలేదు. అలా ఎత్తుకుని లోపలకు తీసుకెళ్ళి మంచంమీద వేసేసింది దుర్గను.

పొద్దున్న లేస్తూనే అక్కనడిగింది.

"నాన్నేరే ?" అని. 'ఇంకా రాలేదు' అంది అక్క. తిన్నగా అమ్మ దగ్గరకెళ్ళి "అమ్మా! గౌను" అంది.

"ఏం గౌనే వెధవ గౌను తినేస్తున్నావు" అని ఒక్క కసురు కసిరే సరికి బావురుమంటూ వెళ్ళి గదిలో కూర్చుంది. అప్పుడే లోపలికి అడుగుపెడుతూ -

"అబ్బబ్బ! ఏంగోలర్రా ; ఎప్పుడు చూచినా కీవర కావరమంటూ ఒకటే గొడవ!" అన్నాడు నాన్న.

ఒక్క అంగలో నాన్నను చుట్టుకొని "నాన్నా ! పువ్వుల గౌను కొనవూ" అంది దుర్గ.

"ఇదేం గొడవే, ఫో ఇక్కడ్నించి. నీ మొగానికో గౌను కూడాను. వెధవ యిల్లు....నరకం నయం. అలసిపోయి ఇంటి కొచ్చిన మొగాడికి కాస్త సుఖం ఇద్దామన్న జ్ఞానంలేదు మనుషులకు. గొడ్లను తోలినట్లు పిల్లల్ని మీదకు తోలడమే" అన్నాడు మోటుగా.

దాంతో అమ్మ కస్సుమంది.

"సంపాదించి ఒరగ బెట్టిందేమీ లేదు గాని అలసిపోయారట అలసిపోయారు - పేకాటలో. ఇంట్లో ఆడది అడుక్కు తెచ్చినా రాజభోగం మాత్రం అమర్చాలి. వెధవ బ్రతుకు !"

ఇంట్లో ఇదంతా మామూలే. అంచేత దుర్గ పట్టించుకోలేదు. తనకు గౌను కావాలి.

నాన్న దగ్గరికెళ్ళి ఏడవసాగింది - గౌను కావాలని. రెండిచ్చుకున్నాడు నాన్న. వెక్కివెక్కి ఏడుస్తూ ఒక మూల నక్కింది.

'పేకాటలో తగలెయ్యడానికి ఎంతన్నా వుంటుందిగాని పిల్లది నోరువిడిచి అడిగితే ఒక్క గుడ్డముక్క కొనడానికి నోచుకోలేదు. వెధవ బ్రతుకు !' అని గొణుక్కుంది అమ్మ.

దుర్గకు ఏడుపు ఆగడంలేదు. తనకి పువ్వుల గౌను కావాలి. ఇంకేమీ వద్దు. ఇంకెప్పుడూ మళ్ళీ గౌను కూడా అడగదు. ఈ వక్కసారికే.... ఒక్క పువ్వుల గౌను కావాలి. తన దగ్గరున్న రంగుల అట్టపెట్టి కావాలంటే ఇచ్చేస్తుంది. తను కూడబెట్టిన బలపాలన్నీ ఇచ్చేస్తుంది. దొడ్లో జామకాయలు కోసి ఇస్తుంది. ఒక్క గౌనే కావాలి.

దుర్గ ఏడుస్తూనే వుంది. అక్క వొచ్చి బ్రతిమాలింది. అన్నయ్య వొచ్చి వినకపోతే రెండు మొట్టికాయలిచ్చాడు. అమ్మ ఎంతో బుజ్జగించింది. అయినా అక్కడ్నించి కదలలేదు.

"పోనీ నా చీర చింపి గౌను కుడతాను రావే" అంది అమ్మ.

"నా కక్కర్లేదు ఫో. ఇంక అడగనే అడగను. నాకేదీ వొద్దు. బడికెళ్ళను. అన్నం తినను. నాకేదీ వొద్దు" అని బెక్కుతుంది.

'చావవే వెధవ మొండిపట్టూ నువ్వునూ.' అని మరో రెండు తగల్నిచ్చి వొదిలేసింది అమ్మ.

* * *

దుర్గ ఇంత ఏడుపు మళ్ళా ఏడవలేదు. ఇటువంటి కోరికలూ మళ్ళా కోరలేదు. వయసు పెరిగిన కొద్ది పరిస్థితులు అర్థం చేసుకోసాగింది.

వొచ్చిన సంపాదనంతా పేకాటలో వొడ్డి ఇంటికి వొచ్చే నాన్న. నాన్నతో దెబ్బలాడుతూ, తిట్టుకొంటూ నాన్న ఇచ్చే కానీ పరకా జాగ్రత్త చేసి గుట్టుగా సంసారం చేసే అమ్మా, వయసు వస్తూన్నా మంచి తిండిగాని, కప్పుకునేందుకు మంచి బట్టగానీ లేక అనామకంగా తిరిగేస్తూన్న అక్క, వేళకు వచ్చి తిండి తిని వీధుల్లో బలాదూరుగా తిరుగుతూన్న అన్నయ్య, ఆకలేస్తే ఏడవడం లేకపోతే నిద్రపోవడం తప్ప ఇంకోటి ఎరుగని చెల్లెలు - వీళ్ళ మధ్య పెరుగుతోంది దుర్గ.

ఏదయినా తనకు కావాలనిపించినప్పుడు అమ్మని అడుగుదామని అనిపించేది, గాని నోరిప్పలేక పోయేది.

తోటి పిల్లలు ఏవేవో చెప్పేవారు. ఎవరి పెళ్ళికి తమకేం కొన్నారో చూపించేవారు. అవన్నీ చూసి, విని గుటకలు మింగేది. తనకూ అలా ఎవరయినా ఇస్తే, కనీసం మాట మాత్రంగా తనను దగ్గరకు తీసుకుని, మా దుర్గకు ఫలాని బట్టలు కొంటాను అంటే....

ఆ వూహకే ఎంతో హాయి ననుభవించేది. కనీసం అక్క పెళ్ళికయినా ఎలాంటిదో ఒకలాంటిది కొత్తది కుట్టించరా ? మా దుర్గ కోసం ఈ బట్టలు అంటూ ఇవ్వరా. ఆశ. అందుకోసం అక్క పెళ్ళిని వాంఛిస్తోంది.

పదేళ్ళ దుర్గకు వొకరోజు 'రేపు అక్కయ్య పెళ్ళి' అని చెప్పింది అమ్మ. 'మరి కొత్తబట్టలు' అని అడుగుదామనుకొన్న దుర్గ అడగలేకపోయింది.

మర్నాడు వుతికిన శుభ్రమైన బట్టలు వేసుకుని అందరూ గుళ్ళో కెళ్లారు. అరగంటలో అక్కయ్య పెళ్ళయిపోయింది. దుర్గకేమీ అర్థం కాలేదు.

కొత్తబట్టలు, బ్యాండు మేళాలు, లడ్డూ జిలేబీలు తినడం, కిళ్ళీలు నమలడం ఏమీలేవు.

ఆ తరువాత వారం రోజులకే నాన్న తిట్టినందుకు అన్నయ్య ఎక్కడికో పారిపోయాడు.

దుర్గ ఆశలు మళ్ళా మామూలు స్థితికొచ్చాయి. అక్కయ్య పెళ్ళికి ఎలాగయినా అడక్కుండా కొత్త బట్టలు కుట్టిస్తారనుకొంది. అదిలేదు. అన్నయ్య వుద్యోగం చేసి సంపాదించి తనకంత మాత్రం కొనిపెట్టడా అనుకొంది. అదీలేదు.

* * *

చీరలు కడుతోంది దుర్గ. స్కూల్ ఫైనల్ చదువుతోంది. ఎవర్నీ ఏమీ అడగదు. ఏం కావలసినా, ఎంత అవసరమయినా నోరు మెదపదు. మనసులోని మాట నోటివరకూ రాదు, రానివ్వదు. ఇంక అడగక విధిలేకపోతే నెమ్మదిగా వెళ్ళి అమ్మా 'నా చీరలు చినిగిపోయాయే' అంటుంది. అలా అడుక్కుంటున్నందుకు కన్నీళ్ళు వుబికేవి.

తను నోరు విడిచి అడిగితే గాని ఏదీ రాదు. తమంతట తాముగా వచ్చి - "దుర్గా నీ కోసం ఈ చీర తెచ్చానమ్మా !" అని ఇచ్చేవారు తనకి ఎవ్వరూ లేరు. నాన్నకు తనుందో లేదో అక్కరలేదు. అన్నయ్య వున్నాడో లేడో తనకి తెలీదు. అమ్మ వొక్కతే అన్నింటికీ ప్రాకులాడుతుంది. తన బ్రతుకయినా బాగుపడుతుందని చెప్పి వాళ్ళ వాళ్ళ సహాయాలతో చదువు ఈడుస్తోంది అమ్మే. ఇంకేం కావాలి తనకు. 'నీ కోసం తెచ్చానమ్మా' అంటే మురిసిపోతూ అందుకునే అదృష్టం తనకు లేదు. చివరకు వో పెన్సిల్ ముక్కేనా అలా ఇచ్చిన వాళ్ళు తనకెవ్వరూ లేరు.

దుర్గకు ఏడుపు వచ్చేది. 'పండక్కు ఏంబట్టలు కొనుక్కున్నావే ?' అని స్నేహితులెవరయినా అడిగితే 'కొనుక్కోలేదు' అనేది మనసులో బాధ పైకి కనిపించనివ్వకుండా.

కొత్త చీర కట్టుకుని, కొత్తగాజులు వేసుకుని, కొత్త రిబ్బన్లు పెట్టుకునీ, –

'మా అన్నయ్య బెంగుళూరు నుండి తెచ్చాడు' అనీ

'మా అక్క ఢిల్లీ నుంచి తెచ్చింది' అనీ

'మా పిన్ని కలకత్తా నుండి తెచ్చింది' అనీ స్నేహితులు చెబుతోంటే నిరాశతో చూసేది.

తన జీవితంలో ఎప్పుడయినా అంత మాట వింటుందా ? చీరలక్కర లేదు. కనీసం రిబ్బను ముక్క "నీ కోసం తెచ్చాను దుర్గా !" అనే క్షణం వస్తుందా ? తనకంత అదృష్టం వుందా!

తనకెవరయినా ఏదయినా తెచ్చియిచ్చే ఘట్టం వూహించుకొని పులకించిపోయేది. కళ్ళు, మనసు ఆశతో నిండిపోయేవి.

స్కూల్ ఫైనలు పాసయింది దుర్గ. అమ్మా నాన్న రెండు రోజులు పోట్లాడుకొని, ఎలాగయితేనేం టీచరు ట్రయినింగుకు పంపించారు.

రోజులు గడవడం లేదు దుర్గకు. ఆ విచిత్రమయిన ఆశ రోజు రోజుకు పెరిగిపోతోంది. నిరీక్షణలో నలిగిపోతోంది.

ట్రయినింగు పూర్తయ్యాక వుద్యోగంలో చేరింది. తన మీద తనకే ఆశ. తన జీతం మీద ఆశ. తన జీవితం మీద ఆశ.

మొదటి నెల జీతం అందుకొని ఇంటికి వచ్చిన దుర్గ అమ్మ చెప్పిన మాటలు విని నీరసించిపోయింది. జీతం అలా అమ్మ చేతిలో పోసేసింది. చెల్లెల్ని చదివించాలి. అప్పులు మాపించాలి. సంసారం గడిపించాలి. దుర్గకు తన కర్తవ్యం ఏమిటో తెలిసింది.

* * *

జీవిత చక్రం తిరిగిపోతోంది. సంసారం తేరుకుంటోంది. చెల్లెలు పెద్దదవుతోంది. అమ్మ కష్టాలు కడతేరుతున్నాయి. కాని దుర్గ ఆశ ఆశలాగే వుంది.

నెలనెలా జీతం వస్తోంది. ప్రతిసారీ పండుగ లొస్తున్నాయి. పండుగల్లో అమ్మకూ, నాన్నకూ, చెల్లెలికీ స్వయంగా స్వంత సంపాదనతో బట్టలు కొంటోంది.

"అదేవిటే వాళ్ళందరికీ కొంటావుగాని నువ్వు కొనుక్కోవేం?" అని తోటి టీచరు శకుంతల అడిగితే "ఎలా కొనుక్కోమంటావు చెప్పు. నువ్వుకూడా తెచ్చుకో అని ఎవ్వరూ అనరు. ఏ మొహం పెట్టుకు కొనుక్కోను...." అనేది ఆకాశంలోకి చూస్తూ. ఆ మాటవిని జాలిపడాలో కోపపడాలో తెలీక వెర్రిగా చూసేది శకుంతల.

కొన్న బట్టలు ఇంటి దగ్గర పడేసి వాళ్ళమొగాలు చూస్తుంది ఆశగా. "నువ్వుకూడా కొనుక్కోలేక పోయావా అక్కయ్యా" అని చెల్లెలంటుందేమోనని, "నువ్వు తెచ్చుకోలేదేమే" అని అమ్మ అంటుందేమోనని.

అనరు. అనరు. ఎవ్వరూ అనరు. తన గురించి ఎవ్వరికీ అక్కరలేదు. "నీ కోసం తెచ్చాను దుర్గా" అనే మాటకు తను నోచుకోకపోయినా, తన డబ్బుతోనే అయినా "నీ కోసం తెచ్చుకో" అనయినా అనరు. పైగా పక్కింటి వాళ్ళతో అమ్మ అంటోంది –

"దానికేం వుందండీ. బయట తిరుగుతుంటుందా, నాలుగూ చూస్తుంటుంది. ఎప్పుడయినా ఏదయినా కంటికి నచ్చితే వెంటనే కొనేసుకోగలదు. ఎటొచ్చీ ఇంట్లో పడివుండేవాళ్ళం మేమే కదా !" అని.

అవును కొనేసుకోగలదు. కొనుక్కుంటోంది కూడా. ఎప్పటికయినా ఎవరయినా తనని తెచ్చుకొమ్మంటారేమోననే ఆశతో చూసి చూసి, నలుగురిలోనూ తిరుగుతూ చిరుగుల చీరలు కట్టుకోలేక - విసిగి కొనేసుకునేది.

కొనుక్కునే సంతోషమయినా వుండనివ్వదు చెల్లెలు. "నీవే బావున్నాయక్కయ్యా " అంటుంది. దాంతో మనసు చివుక్కుమనిపోయి కట్టుకో బుద్ధికాదు.

* * *

దుర్గను పెళ్ళి చేసుకుందుకు ఇష్టపడి ఇంకో టీచరు దుర్గ తండ్రిని అడిగాడు.

'అలా చేసుకు తీసుకుపోతానూ అంటే మా అభ్యంతరమేంలేదు. మేమేమీ పెట్టలేము సరికదా చెల్లెలి చదువుకి దుర్గే పెట్టాలి' అన్నాడు.

ఎవరి ఖర్చులు వారే పెట్టుకునే వప్పందం మీద గుళ్ళోనే దుర్గ పెళ్ళి జరిగింది. నాన్న తత్వం తెలిసిన దుర్గ, నాన్న దగ్గర్నుంచి ఆశించకపోయినా, ముచ్చటకయినా భర్త ఒక చీర కొంటాడనుకుంది.

సంసారంలో ప్రవేశించాక ఆశ చిగురేసింది.

కోరి పెళ్ళాడిన భర్త తన కోసం ఏం తీసుకురాడా! 'నీ కోసం తెచ్చాను దుర్గా!' అని ప్రేమతో తన కళ్ళల్లోకి చూడడా! తన కోసం తెచ్చే ఆ అపురూపమయిన వస్తువు ఏమిటో ... ఒక్కసారి అటువంటి దొస్తే చాలు ... తనుందని, తనకివ్వాలని, తను సంతోషిస్తుందని ... ఒక వ్యక్తి ఇచ్చిన స్మృతిని, ఈ ప్రపంచంలో తన వునికిని గుర్తించిన స్మృతిని ... జీవితాంతం మనసులో నిల్పుకొంటుంది. తన జన్మంతా పువ్వులతో పూజ చేస్తుంది ఆ వస్తువుని.

ప్రతి దినమూ భర్త వొచ్చేసరికి చేతులపక్కా పెదవులపక్కా ఆశగా చూసేది, తన కోసం తెచ్చే అపురూపమయిన ఆ వస్తువు కోసం, ఈ ప్రపంచంలో తన వునికిని గుర్తించే ఆ మాట కోసం. అతను దగ్గర పడుతున్నకొద్ది గుండెలు కొట్టుకునేవి. మొహంలో ఆశ ఆనందం తన్నుకు వస్తూంటే ఆపాదమస్తకం వొణికిపోయేది. ఆ సంతోషాన్ని ఎలా భరించాలా అని ఆవేశపడేది.

అతను ఆమె ఆరాటాన్ని గమనించకుండా బట్టలు మార్చుకొని ఆమెకు వంట దగ్గర సహాయం చెయ్యాలని కూర్చునేవాడు. అరగంట గడిచేవరకూ ఆ వుద్వేగ్నత సర్దుకోలేకపోయేది.

రోజులు గడుస్తున్న కొద్దీ ఆ ఆశకూడా క్షీణించసాగింది దుర్గకు. అతనికి ఏ తలంపూ లేదు. అమ్మా నాన్నకు డబ్బు పంపడం, దుర్గ జీతం కూడా తీసుకుని సంసారానికి సంబారాలు తీసుకురావడం, స్నేహితులతో తిరగడం - అంతే అతను.

పెళ్ళయిన కొత్తలో కనీసం పువ్వులయినా తెస్తాడనుకొంది దుర్గ. అలాంటివి స్ఫురించాలనే వుద్దేశంతో ఒక నెల అతనికి చెప్పులు కొంది. ఒక నెల బట్టలు కొంది. అన్నీ తీసుకుని వూరుకునేవాడు.

దుర్గకు ఏడుపొచ్చింది. వెధవ బ్రతుకు. ఏ జన్మలో ఏం పాపం చేసుకుందో. ఒక్క దమ్మిడీ తన కోసం ఖర్చు పెట్టాలని అనిపించడం లేదు ఎవరికీ. ఇంతకన్నా పరమ దరిద్రం నయం.

'మావారు తెచ్చారండీ' అని నెలకో కొత్త చీర కట్టుకొచ్చేది శకుంతల. అప్పటి ఆమెలో ఎంతో అందం, ఆనందం కనిపించేవి. 'అదృష్టవంతురాలివి' అనేది దుర్గ.

'మా అమ్మ పెట్టిందండీ' అనేది పక్కింటమ్మాయి పుట్టింటి నుండి వస్తూ చీర తెచ్చుకొని.

'బావుందండీ' అనేది దుర్గ. బావుండకపోతేనేం, తనకోసం ఎవరో తెచ్చియిచ్చిన వస్తువు బాగుండకపోతేనేం, తనంటూ ఒకతె వుందని గుర్తించి ఇవ్వడం చాలదూ జన్మకి. తనకే అలా ఇస్తేనా కళ్ళకద్దుకుని తలమీద పెట్టుకునేది.

పువ్వులు కొనుక్కోడానికి వెళ్తూ పువ్వుల అంగడి చుట్టూ మూగివున్న మగవాళ్ళను చూడలేక కొనకుండానే వచ్చేసేది. 'మావారు హైద్రాబాదు నుండి గాజులు తెచ్చారు చూడండీ,' అంటూన్న ఆడవాళ్ళ మాటలు విని మ్రాన్పడిపోయేది. బజారులో కనిపించి 'ఎలాగూ రానే వచ్చారు, ఓ చీర సెలక్టు చేదురుగాని రండి' అంటున్న తోటి మాస్టర్లని - 'క్షమించండి పనుంది' అని తప్పించుకు వచ్చేసేది.

* * *

దుర్గ దుర్గమ్మ అయింది. ఇద్దరు కొడుకులూ ఒక కూతురూ పుట్టారు. పెద్ద కొడుకుని వేలు పట్టుకుని నడిపిస్తూ వెళ్తున్న దుర్గకు తల అక్కడక్కడ నెరుస్తోంది. మనిషి స్థూలమయి నడక మందగించింది.

రాత్రి భోజనం చేసిన తరువాత ఆరుబయట మంచం వేసుకొని పిల్లల్ని చుట్టూ పడుకోబెట్టుకొని కథలు చెప్పేది దుర్గమ్మ. అమ్మా అమ్మా అంటూ కొంగు పట్టుకొని చుట్టూ తిరుగుతున్న పిల్లల్ని చూసి మురిసిపోయేది. పిల్లలకు తన మీదున్న ప్రేమ చూసి వుప్పొంగిపోయేది.

తనలాగ కాకూడదు వాళ్ళు. తనలా తపించి పోకూడదు. తమని గమనించి రక్షించే అమ్మ వుందని తెలుసుకోవాలి. అడక్కుండానే అమ్మ అన్నీ ఇస్తుందని తెలుసుకోవాలి.

జీతం అందుకోగానే పిల్లల అవసరాలు ముందు చూసి తరువాత ఏ పనయినా ఆలోచించేది దుర్గమ్మ. తన పిల్లలు పెద్దవాళ్ళయి తనని చూస్తారు. తన కోరిక తీరుస్తారు. అమ్మను గుర్తించి అమ్మ కోసం తెస్తారు. ఏదో ... ఏదేదో ...

దుర్గమ్మ ఆశ మరచిపోలేదు.

'మా అమ్మాయి బజారు కెళ్తే ఇవి కనిపించాయట. చూడగానే నేను జ్ఞాపకం వచ్చానట, తెచ్చింది. గుచ్చుకోకుండా మెత్తగా బావున్నాయి సుమా' అని సిగ పిన్నులు తీసి శకుంతల చూపిస్తోంటే –

'మా అమ్మాయీ తెస్తుంది. మా అమ్మాయీ తెస్తుంది' అనుకునేది మనసులో దుర్గమ్మ. ఆ గుండె ఎప్పుడు తెస్తుంది, ఎప్పుడా క్షణమొస్తుంది అని ఆవేశపడేది.

'మా అబ్బాయీ తెస్తాడు. వాడికి నేనంటే ఎంత ప్రేమో!' అని వువ్విళ్ళూరేది. ఆ క్షణం కోసం తహతహ లాడేది.

* * *

దుర్గమ్మ పెద్దకొడుకు ప్రసాద్ వుద్యోగం రావడం వల్ల అమ్మని వదిలి వెళ్ళిపోయాడు. అంతకు ముందే కూతురికి పెళ్ళిచేసి పంపించింది. ఇప్పుడు దగ్గర చిన్నకొడుకు మాత్రమే వున్నాడు.

పెద్దకొడుకు వుద్యోగానికి వెళ్ళిన దగ్గర నుండీ ఎదురు చూడసాగింది. ఏం పంపిస్తాడో ... డబ్బు పంపిస్తాడా ? ... బట్టలు పంపిస్తాడా ? ... లేక అక్కడ దొరికే ఏ చిత్రమయిన వస్తువులో

పంపిస్తాడా ? ఎన్నాళ్ళకు తీరబోతోంది తన కోరిక. ఎన్నాళ్ళకి దయ కలిగింది అదృష్టానికి తనమీద. వాడికి తనంటే చాల ప్రేమ. తనకోసం ఏమయినా చేస్తాడు. ఏం తెమ్మన్నా తెస్తాడు.

నెలరోజులు తిరగ్గానే వుత్తరం వచ్చింది పెద్దకొడుకు నుండి. 'మొదటి జీతం అందుకున్నాను. ఈనెల రోజులూ చేసిన అప్పులూ, హోటలు బిల్లు చెల్లించాలి, మంచి బట్టలు కుట్టించుకోవాలి. కొన్ని అవసరమయిన వస్తువులు కొనుక్కోవాలి. అందుచేత కొన్ని నెలలపాటు ఏమీ పంపలేక పోతున్నందుకు విచారంగా వుంది. గదికోసం వెతుకుతున్నాను' ఈ ధోరణిలో నడిచింది అంతా.

దుర్గమ్మ హతాశురాలయింది. ఇంతేనా తన బ్రతుకు. ఇంతేనా తన అదృష్టం. పిల్లలకు కూడా తనేమిటో అర్థం కాలేదా ? తన మనసేమిటో గుర్తించలేదా ? నోరిప్పి అడిగితే కాని తనకేదీ రాదా ? తనుగావెళ్ళి తెచ్చుకుంటేనేగాని తనకేదీ వుండదా ?

దుర్గమ్మలో వేదన వుబికింది. తనకీ కోరికేమిటీ ? ఏడవడానికయినా వీల్లేని, ఒకరితో చెప్పుకోడానికి వీల్లేని ఈ కోరికేమిటి ? చిన్నప్పటి కోరిక ఇంత వయస్సొచ్చినా తీరక పోవడమేమిటి? పోనీ చావక పోవడమేమిటి ? ప్రతి మనిషికీ తీరే కనీసపు కోరిక తనకు తీరక పోవటమేమిటి ? అన్ని కోరికలు అల్పమై ఇదొక్కటే అత్యధికమై తనలో పీఠం వేసుకోవడమేమిటి ?

దుర్గమ్మ సగం మతిపోయిన మనిషిలా అలా అలా తిరిగేస్తోంది. నాలుగు నెలలు తిరిగేసరికి నలభై ఏళ్ళ దుర్గమ్మ మంచాన పడింది. పదిరోజులు గడిచేసరికి వచ్చే ప్రాణం పోయే ప్రాణంగా మారింది. కొడుక్కీ కూతురికీ వైరిచ్చారు. భర్త మంచం పక్కనే విడవకుండా కూర్చున్నాడు.

'అమ్మా! చూడమ్మా నేను వొచ్చాను' అన్నాడు పెద్దకొడుకు దుఃఖం గొంతులో సుళ్ళు తిరుగుతూంటే.

'అమ్మా! అమ్మా! ... లక్ష్మినమ్మా!' అంటూ ఏడుస్తోంది కూతురు. దుర్గమ్మ కష్టంమీద కళ్ళు తెరిచింది. ఆ కళ్ళల్లోకూడా ఆ ఆశ తళుక్కుమంది.

'దుర్గా! దుర్గా!' అన్నాడు భర్త వొణుకుతో. దీనంగా చూసింది దుర్గమ్మ అందరిపక్కా. ఆశగా చూసింది కొడుకుపక్కా కూతురిపక్కా. నిరాశగా కళ్ళు మూసింధి.

గొల్లుమన్నారందరూ. ఒక అరగంట గడిచేటప్పటికి - 'శవం మీద కొత్త బట్ట కప్పాలి తీసుకురండి' అన్నారు ఎవరో. పెద్దకొడుకు లేచి 'నేను తెస్తాను' అన్నాడు. 'మా అమ్మ కోసం నేను తీసుకు వస్తాను' అనుకున్నాడు జేబులోంచి సొంత సంపాదన తీస్తూ.

తెలుగు స్వతంత్ర, అక్టోబర్ 1960.